# ఆక్రమణం

అంతా దట్టమైన అడవి. ఆ అడవి మధ్యలో ఓ పది గుడిసెలు గుంపుగా వున్నాయి. వాటిని ఊరు అనో పల్లె అనో గూడెం అనో అనడానికి తగినట్లుగా లేవు. వెదురుబొంగులు మోదుగాకులతో వేసిన ఆ గుడిసెల్లో లచ్చుభీమాల కుటుంబాలతో కలిసి అంతా పది కుటుంబాలున్నాయి. ఎండాకాలమైనా, చలికాలమైనా మంటలు వేసు కొని అందరూ బయట గుంపుగా చేరి కూర్చుంటారు. వాళ్ళు మాట్లాడుకునే మాటలు ఎక్కువగా ఉండవు. వాళ్ళకు తెలిసిన భాష పదాలు తక్కువ కాబట్టి వాళ్ళు మాట్లాడుకునే మాటలూ భావాలూ తక్కువే వుంటాయి.

ఆరోజు వాళ్ళ దేవర ఆకయ జాతర. ఆ యేడు సజ్జలు జొన్నలు బాగా పండాయి. అది తెలిసే కావచ్చును రంగయ్య రెండు బండ్లల్లో మస్తు సామాను తెచ్చాడు జాతరకు. ఆ అడివి జనానికి బయటి ప్రపంచంతో సంస్కృతి నాగరికతలతో లంకె రంగయ్య వల్లనే. రంగయ్యకు జాతర ఎప్పుడు వస్తుందో తెలుసు. జాతరకు ముందురాత్రే రెండు బండ్లతో వస్తాడు. వెంబడి ఒక జీతగాడు. ఇద్దరు కలిసి తాము తెచ్చిన బెల్లం పొగాకు పేలాలు చక్కెర బిల్లలు బట్టలు పూసల పేర్లు తెల్లగా వెండిలాగా మెరిసే కడియాలు దండలు మొదలైన సామాన్లన్నీ చాపలు వేసి పరుస్తాడు. ఈ మధ్య రంగు రంగుల రిబ్బన్లు, పిన్నులు ప్లాస్టికు పూలు తెస్తున్నాడు. అవన్నీ చూసి అడవి జనులు ఎగబడ్తారు. సంవత్సరానికి కావల్సినంత బెల్లం పొగాకు కొనుక్కుంటారు. వాళ్ళకు పండిన ధాన్యం చాలాభాగం రంగయ్య తెచ్చిన గోనెసంచుల్లోకి పోతుంది. వస్తు మార్పిడిలో తామెంత నష్టపోతున్నారో అడవి జనులకు తెలియదు. రంగయ్య వెళ్ళిపోయిన కొన్నాళ్ళకే తిండి కోసం మగవాళ్ళంతా విల్లు అంబులు పట్టుకొని వేటకు బయలుదేరుతారు. ఆడవాళ్ళు పిల్లలతో బుట్టలేసుకొని కందమూలాలను తవ్వి తీసుకురావడానికి అడవిలో దూరుతారు.

ఆరోజు జాతరలో రంగయ్య తెచ్చిన సామాన్లు తొందరగానే అమ్ముడుపోయాయి. సంగయ్య తెచ్చిన ఖాళీ బస్తాలు, సజ్జలు జొన్నలతో నిండిపోయాయి. ఆడవాళ్ళు మగవాళ్ళు పిల్లలు కొన్న పూసల పేర్లను దండలను అలంకరించుకున్నారు. ఆడవాళ్ళు రంగు రంగుల రిబ్బన్లను కొప్పుల్లో చుట్టుకున్నారు. ఇంతకుముందు అడవిలో దొరికే తాజా పూలను మాలలుగా కుచ్చి అలంకరించుకునేవాళ్ళు ఇప్పుడు ప్లాస్టిక్ పూలను పెట్టుకున్నారు. ముఖాలకు ఒంటికి తాము వేటాడిన జంతువుల కొవ్వును పూసుకోవడంతో వాళ్ళ చామన

చాయగా నల్లగా వున్న శరీరాలు నిగనిగ మెరుస్తున్నాయి. ఆడవాళ్ళు పొడుగాటి గుడ్డను మొలచుట్టు చుట్టుకొని ఆ గుడ్డలోని కొంతభాగాన్ని పైకి లాగి రొమ్ములను కప్పుకున్నారు. మగవాళ్ళు చిన్నగుడ్డనునడుముకు గోచిలాగా కట్టుకున్నారు. వేరే ఏ బట్టలూ వాళ్ళ ఒంటి మీద లేవు. ఆడవాళ్ళు, మగవాళ్ళు నెమలి ఈకలను తలకు అలంకారంగా ధరించారు. ఆరోజు సాయంత్రం వరకు ఆకయకు పూజలు జరిగాయి. తమకు పండిన ధాన్యాన్ని ఆ దేవర ముందు పెట్టారు. పెద్దలూ, పిల్లలూ అందరూ దేవర గుడిముందు గుమిగూడారు. దేవరకు పూజలు చేసే వీరూకు పగలు మూడోజాముకు ఆవేశం వచ్చింది. వెనుకకూ ముందుకూ ఊగసాగాడు. లచ్చూభీమాలు పోయి అతనికి చెరోపక్కన చేరి పట్టుకున్నారు.

"దేవరా! మేం ఏమైన తప్పు చేస్తే చెప్పంగ్రి" అన్నాడు లచ్చూ ప్రాధేయపూర్వకంగా.

"తప్పు గాదురా! మీరు నాకు పూజలు మనసు ఎట్టి చేస్తలేరు"

"మాది తప్పయింది దేవర! మమ్ముల్ని కాపాడుంగ్రి. వచ్చే యేడు ఎట్ల వుంటదో మాకు చెప్పంగ్రి" అన్నాడు లచ్చూ.

"వచ్చే యేడు మీరిక్కడ వుండొద్దురా ఇంక అడవిలకు దూరంగా పొంగ్రి. అక్కడ మీకు మస్తుగ పంటలు పండుతయి. ఏ భయముండదు" అన్నాడు వీరూ.

"అట్లనె దేవర! ఇక్కడి నుంచి ఎల్లిపోతం. వచ్చేయేడు బాగ పంట పండితే పెద్ద పండుగ జేస్తం" అని లచ్చూ భీమాలు మొక్కారు. వాళ్ళతోపాటు అందరూ మొక్కారు.

ఆ కార్యక్రమం అంతా అయ్యేసరికి సాయంత్రమైంది. ఇక వాళ్ళ సంబరాలు మొదలయ్యాయి. ఒకరిద్దరు పొడుగాటి మద్దెలలను వాయించసాగారు. అందరూ ఇప్ప సారాను కడుపుల నిండా తాగారు. ఇక వాళ్ళ ఆనందానికి అడ్డం లేకుండా పోయింది. ఆడవాళ్ళ ఒకరి చేతులు మరొకరి భుజాల మీద అల్లుకొనిపోయాయి. గుండ్రంగా తిరుగుతూ ఆడడం మొదలుపెట్టారు. అల్లిబిల్లి పాటలు. వాళ్ళ అడుగులు మద్దెలతో సరిగా లయలో పడుతూ లేస్తున్నాయి. వాళ్ళ ఆటలో మరోవైపు మగవాళ్ళూ చేరారు. పిల్లలూ కేరింతలతో గంతులు వేసారు. అట్లా వాళ్ళ జాతర సంబరాలు ఓ రాత్రి దాకా సాగాయి.

జాతరకు ముందే కాన్నా వచ్చాడు. వాడు ఎవరికీ చెప్పా పెట్టకుండా ఎక్కడికో పోయాడు. పోయి ఆరు నెలలయింది. జాతర నాలుగు రోజులందనగా వచ్చాడు. చాలా మారిపోయాడు. బక్కచిక్కి వుండేవాడు. ఇప్పుడు బలంగా అయ్యాడు. వాడికి పొడుగాటి చింపిరి జుట్టు వుండేది. దాన్ని క్రాపుగా కత్తిరించుకొని చక్కగా దువ్వుకున్నాడు. వెంట్రుకలు సెంటునూనెతో గుమగుమ లాడుతూ మెరుస్తున్నాయి. పిల్లిగడ్డాలు మీసాలుండేవి. ఇప్పుడు చక్కగా క్షవరం చేసుకొని బొద్దుగా మీసాలు పెంచాడు. రంగురంగుల ప్యాంటు షర్టు వేసుకున్న కాన్నాను చూసి ఆ అడవిజనులు మొదట భయంగా దూరందూరంగా పోయారు. కాని వాడి మత్తుమాటలు మొత్తం మీద వాళ్ళను మార్చాయి. ఒక్కొక్కరూ వానికి దగ్గరగా వచ్చి బట్టలు ముట్టుకోవడం, బట్టలు మురుక చూడడం చేసారు. పండ్లు ఇకిలించారు.

కిలకిల నవ్వారు. కాన్యా తనతో మూట గట్టుకొనితెచ్చిన అంగీలను, రవికెలను తలా ఒకటి ఇచ్చాడు. దాంతో అందరూ సంబరపడిపోయారు. సంతోషంతో ఆ బట్టలు వేసుకొని నాట్యంలో పాల్గొన్నారు ఆ జాతర రోజు.

కాన్యా సోమ్లాకు తమ్ముడు. తమ్ముడు ఇట్లా తిరిగి వచ్చినందుకు సోమ్లాకు ఆనందంగా గర్వంగా వుంది. తమ్ముడు ఎంతో గొప్పవాడైనట్లుగా మురిసిపోయాడు. కాని సోమ్లా భార్య రేఖికి కాన్యా వేషాలు ఏం ఇష్టం కాలేదు. వాడ్ని చూసి "ఎవలెవలతో సోపతులు పట్టి ఒచ్చిండో. లేకపోతె గా బట్టలన్ని ఎక్కడ ఎత్తుకొచ్చిండో" అని రేఖి మూతి ముక్కు తిప్పింది. అసలు రేఖి తిట్లకు భయపడే కాన్యా ఇంటినుంచి పోయాడని అందరికి తెలుసు.

జాతర రోజు అర్ధరాత్రి వరకూ సంబరాలు సాగాయి. తెల్లవారగట్ల అందరూ నిద్రల్లోకి జారారు. అప్పుడే కాన్యా భీమా గుడిసెలోకి దూరాడు. భీమా భార్య జంగి పక్కలోకి పాములాగా పాకాడు. జంగి సగం నిద్రలో కాన్యాను కావలించుకుంది. కాన్యా బలంగా వేడిగా వున్న ఒళ్ళు దానికి కొత్తగా తగిలింది. నిద్రలో నుంచి పూర్తిగా మేల్కొని లేచి లొల్లి పెట్టింది. అరిచింది. దాంతో కాన్యా ఆ చీకట్లో పాములాగానే బయటికి సర్రున పారి పోయాడు. కాని ఆ వచ్చింది ఎవరో కాదు కాన్యా అని జంగి పసిగట్టింది. అది కండ్లతో చూడనక్కర లేకుండా మురక చూస్తేనే ఏ వస్తువో, ఏ జంతువో ఏ మనిషో చెప్తుంది.

రాత్రి జరిగిన గోల అందరికీ తెలిసింది. అందర్నీ ఆకయ గుడి దగ్గరకు రమ్మన్నాడు భీమా. ఎప్పటిలాగానే లచ్చ్యా పెద్దరికం చేశాడు. ఆ జనుల్లో లచ్చ్యాయే కాస్త మాట నేర్చినవాడు. ధైర్యం గలవాడు. లచ్చ్యా అందరివైపు చూసాడు. భీమా ఒకవైపు ముఖం చిన్నబోయి కూర్చున్నాడు. వాడి పక్కనే జంగి ఏడుస్తూ ఇద్దరు పిల్లలతో నిలబడింది. ఇంకోవైపు సోమ్లా రేఖి నిలబడ్డారు. వాళ్ళ దగ్గరే కాన్యా నిలబడ్డాడు. చాలా నిర్లక్ష్యంగా కనిపించాడు. లచ్చ్యా కాన్యా వైపు చూసాడు. మళ్ళీ అందరి వైపు చూపులు తిప్పాడు.

"రాత్రి కాన్యా చేసిన పని ఏం బాగలేదు" అన్నాడు.

"నేనేం జేసిన!" అన్నాడు కాన్యా కోపంగా.

"రాత్రి నువ్వు నా పక్కల దూరలే?" అడిగింది భీమా భార్య జంగి.

"నేను గాదు" అన్నాడు కాన్యా నిర్లక్ష్యంగా.

"ఇగో అట్ల అబద్ధాలాడకు. అబద్దాలాడేటోల్లను ఆకయ దేవర చమించడు. శిచ్చ ఏస్తడు. ఆ దేవర ముందల నిలబడి నేను గాదని అనుచూద్దాం" అన్నాడు లచ్చ్యా.

కాన్యా దొంగచూపులు చూసాడు. ముందుకు రాలేదు. దేవర ముందలకు వచ్చి నిలబడలేదు. "అబద్ధమాడితే నాకేమైన అయితే" అని భయపడ్డాడు. కాన్యా నిశ్శబ్దంగా నిలబడడం చూసాడు లచ్చ్యా.

"జంగీ! నువ్వు కాన్యాను పిలిశినవా నీ కాడికి" అడిగాడు లచ్చ్యా జంగివైపు చూస్తూ.

"లేదు నేను పిల్వలేదు" అంది జంగి.

లచ్చూ కాన్హా వైపు తిరిగి "కాన్హా నువ్వు తప్పు చేసినవు. జంగి నిన్ను పిల్వలేదు. అయిన నువ్వు పోయినవంటె మన కాయిదను బట్టి అది తప్పు. వాల్ల అనుమతి లేకుంట దేన్నీ ముట్టం మనం. అటువంటిది జంగి మానం దోసుకుంటనని పోయినవు. జంగి ఇష్టపడితె తప్పు లేకుండె గాని ఇప్పుడు నువ్వు జంగి దగ్గరికి పోవుడు తప్పు. ఈ తప్పుకు శిచ్చగ నువ్వు మన గుడిసెలకు దూరంగ పోవాలె. మా కండ్ల పడొద్దు" అన్నాడు లచ్చూ.

లచ్చూ మాటలు వినగానే అందరూ సంతోషంగా "ఊ.... ఊ...." అని అరిచారు. తమ సమ్మతిని తెలియజేసారు. ఒగరి సొత్తును బలవంతంగా గుంజుకునేటోళ్ళకు అదే శిచ్చ తమ అడవి జనుల్ల. ఆఖరికి ఒక ఆడదాన్ని దాని ఇష్టం లేకుంట పొందాలనుకునుడు తప్పు. దానికి తప్పు చేసినోళ్ళను దూరంగా వెళ్ళగొట్టడమే శిచ్చ !

లచ్చూ తీర్పు విని సోమ్లా ముఖం నల్లబడింది. అతనికి బాధ అయింది. రేఖి ముఖంలో సంతోషం కన్పించింది. రేఖికి మొదటి నుంచీ కాన్హా అంటే ఇష్టం లేదు. తింటాడు, పనేం జేయడని కోపముండేది. ఇప్పుడేమో ఏమేమో సామాన్లు తెచ్చిండు. వాటిని చూసి తన పిల్లలూ గుడిసెల్లోని పిల్లలూ చెడిపోతరని రేఖికి బాధగా, కోపంగా వుంది. "వీని జూసి అందరి పోరలు గట్లనే బలగానికి దూరంగ పోతె" అని రేఖి భయపడింది. అందుకనే రేఖికి సంతోషమైంది. "వీడు మల్ల ఒచ్చింది గుడిసెల నాశనగాలానికే" అని బాధపడింది రేఖి. ఇప్పుడామె మనస్సు నెమ్మదైంది.

అయినా వీనికి గీ గుడిసెల్ల పెండ్లిగాని పోరి దొరకలేద! ఎందుకు గా జంగి పక్కల దూరిండు సోమ్లా మనస్సులోనె అనుకొని తల నేలకేసుకున్నాడు. కాన్హా చేసిన పని సోమ్లాకు అవమానంగా అనిపించింది. నిట్టూర్పు విడిచాడు.

కాన్హా ఎవరితో చెప్పకుండా తెల్లవారి మాయమయ్యాడు. వర్షాకాలం రాకముందే అడవి లోపలకి మరోచోటుకు వెళ్ళిపోవాలనే ప్రయత్నాల్లో అందరూ మునిగిపోయారు. తమకున్న కొడవలి గొడ్డలి మొనదేలిన కట్టెలు, బుట్టలు, కుండలు, అటికలు అన్ని సద్దుకొని అందరూ కొత్త జాగాను వెతుక్కుంటూ ఇంకా అడవి లోపలికి వెళ్ళిపోయారు. అడవి లోపల మంచి ఎర్రభూమిని చూసుకొని వాళ్ళు మోదుగు ఆకులతో వెదురు బొంగులతో గుడిసెలు వేసుకున్నారు. ఆకయ దేవరకు ఓ మంటపం వేసి ఉంచారు. ఎక్కడికి పోయినా ఆకయ దేవరను కొత్తగా పెట్టుకోవడం వాళ్ళకాచారం. ఆ దేవరకు మొక్కినంకనే ఏ పనైనా మొదలుపెడ్తారు. వాళ్ళ ఆచారం ప్రకారం ఆకయ దేవరకు మొక్కి చెట్లు కంప నరికి కొత్త జాగాను చదును చేసారు. రెండు వానలు పడ్డాక కొడవలితో మొనదేలిన కట్టెలతో భూమిలో గుంటలు తవ్వి విత్తనాలు వేసారు. అది సారవంతమైన భూమి, విత్తనాలు మొలిచి బాగా పెరిగాయి. ఆ యేడు పంట బాగానే వస్తుందనుకున్నారు. వచ్చిన పంటను అందరూ సమానంగా పంచుకుంటారు. ఓ యేడాది ఏ చీకూచింతా లేకుండా గడిచి పోయింది. ఎప్పటిలాగే ఆకయ దేవరకు జాతరలు, పూజలు జరుగుతున్నాయి. రంగయ్య

ఇక్కడికి రావడం లేదు. అదొక్కటి వాళ్ళకు బాధగా వుంది. వున్నట్లుండి ఒకరోజు సర్కారు మనుషులు కొందరు వచ్చారు. వాళ్ళు ఎంతమంది వున్నారని లెక్కలు వేసుకపోయారు. జంగల్ల వున్నందుకు శిస్తు కట్టాలన్నారు. పంటకు పన్ను కట్టాలన్నారు. అదంతా వాళ్ళకేం అర్థం కాలేదు. వాళ్ళకు కోపం వచ్చింది. ఈ అడవి, భూమి, గాలి, నీరు అంతా మాది. మేం పండించిన ధాన్యంల వాళ్ళకు పాలు ఇయ్యడమేంది? పన్ను ఏంది? అని రందిలో పడ్డారు. ఇక్కడేం బాగలేదు. మల్ల మునుపున్న చోటుకె పోదాం అనుకున్నారు.

అక్కడ భూమి తిరిగి సారవంతమై వుంటుంది. అక్కడికి సంగయ్య తప్ప యీ సర్కారు మనుషులెవ్వరూ రారు అనుకున్నారు. అక్కడికిపోయి చూస్తే తామున్నచోటు మునుపటోలె లేదు!

ఎక్కడైతె వాళ్ళ గుడిసెలుండేవో అక్కడ ఒక పెద్ద ఇల్లు లేచింది. చుట్టూ రాళ్ళతో ప్రాకారం గోడ. చుట్టుపక్కల ఓ ముప్ఫై వరకు పెంకుటిండ్లు ఉన్నయి. ఇట్లా ఎప్పుడూ జరగలేదు. ఎప్పుడూ అడవిలో తమ జాగాలు తమకే వుండేయి. ఎన్నాళ్ళకు తిరిగి వచ్చినా ఇట్లా ఎవరూ వచ్చి కబ్జా చేసుకునేవాళ్ళు గాదు. అడవి పశు పక్షులకు ఎట్ల సొంతమో తమకూ అంతే సొంతంగా వుండేది. అటువంటిది ఇదేమిటి? వాళ్ళల్లో కలవరం మొదలైంది. గుబులు పుట్టింది. ఇది మన బూమేనా? - అని అనుమానం కూడా కలిగింది వాళ్ళకు.

"మన చోటు కాదిది. మనం మల్ల అడవిలకు దూరంగ పోదాం" అన్నాడు ముసలి రామా.

"కాని అడవిలకు ఎంత దూరమని పోతం దాదా! చూస్తున్నం గద అడవి మునుపటి లెక్క లేదు. సర్కారు మనుషులు గస్తీ తిరుగుతుండ్రు. అడవిల వున్నందుకు శిస్తు కట్టమంటుండ్రు. పండిన పంటల పాలు పొయ్యమంటుండ్రు. కట్టె కొట్టనిస్తలేరు. విల్లు అంబులతో పశుపక్షులను వేటాడొద్దని కాపలా వుంటున్నరు. అదంత మన సాతే. అడవిల కాయ పండు దేన్ని ముట్టుకోనిస్త లేరు. ఎల్లగొడుతుండ్రు. అడుగడుగున తిప్పలు పెడుతుండ్రు. మునుపు అడివంత మనదే అనుకున్నం. మన సొంతంగ పచ్చుల లెక్క బతికినం. ఎవరు మన జోలికి రాలేదు. మనం ఒకరి జోలికిపోలేదు. ఇప్పుడు జంగల్ మనదని చెప్పుకునెటట్ల లేదు. అంతా మారిపోతున్నది" అన్నాడు లచ్చు అందరివైపు చూస్తూ.

"మనిషికి ఆశ ఎక్కువైపోతుంది. ఎక్కడి బూములు సాలుత లేవు వాళ్ళకు. బూములన్ని మావే అంటుండ్రు. ఎన్కటి నుంచి మనముంటున్న జంగల్ భూములు గూడ మావే అంటుండ్రు. కబ్జాలు చేసుకుంటుండ్రు" అన్నాడు బీమా చాలా విచారంగా.

"ఇన్నాళ్ళు యీ జంగల్‌ను నమ్ముకొని బతికినం. ఇగ అట్ల వుండె రోజులు పోయినయి!" ముసలి రామా ఒప్పుకున్నాడు. నిస్పృహ ధ్వనించింది అతని గొంతులో.

"ఇక ఒకచోటు నుంచి ఇంకోచోటుకు పోయే రోజులు పోయినయి దాదా! కలో గంజో తాగుకుంట ఇక్కడ్నె పడి వుండాలె. కష్టం జేసుకుంట ఇక్కడ్నె వుందం. జంగల్ల

సర్కారోల్లు మనలను నెగుల నిచ్చెటట్లు లేరు. ఇగ ఆ బంగ్లల వున్న దేవరే దిక్కు మనకు'' అన్నాడు లచ్చూ.

''ఇగో మన గుడిసెలు ఇక్కడ్నే వుండేయి. పోయి గా దేవర నడుగుదాం. ఇక్కడ గుడిసె లేసుకుంటమని'' అన్నాడు మళ్ళీ లచ్చూ.

అందరూ అటుదిక్కు నడిచారు. భయంతో ఒకరి దాపు మరొకరు విడువకుండా నడుస్తున్నారు. లచ్చూ భీమాలు కొద్దిగా ముందున్నారు. వాళ్లంతా గుంపుగా భవనం ముందుకు పోయి నిల్చున్నారు.

తెల్లని మల్‌మల్ దోతి లాల్చీలో చేతిలో బెత్తంతో కుర్చీ మీద కూర్చొని కన్పించాడు ఒక వ్యక్తి. అతని పక్కన వాళ్ళకు పరిచయమున్న రంగయ్య చేతులు కడుపుమీద ముడుచు కొని నిలబడి వున్నాడు.

''ఎవరు మీరంతా?'' ఉరుము ఉరిమినట్లుగా అరిచాడు బెత్తం పట్టుకున్నతను.

''మేం.... మేం....'' లచ్చూ గొంతు లోంచి మాట పెకిలి రాలేదు.

''వీళ్ళు అడవి మనుషులు దొరా!'' అన్నాడు రంగయ్య.

''అయితె ఎందుకొచ్చింంద్రు'' కసిరాడు దొర.

''దేవరా!.... దొరా! మా గుడిసెలు ఇక్కడ్నె వుండె. మా ఎవసాయం బూములు గవే'' అని లచ్చూ చేయెత్తి చూపుడువేలుతో వాళ్ళు పోడు వ్యవసాయం చేసుకున్న భూముల వైపు చూపించాడు.

''అయితె ఏందట! ఇప్పుడు యీ భూములన్నీ నావి. నాకు బాజాప్తా పట్టా అయినయి. సర్కారుకు శిస్తు చెల్లిస్తున్న. మీకేం హక్కుల్లేవు ఇక్కడికి వచ్చి వుండెటం దుకు'' అన్నాడు దొర కోపంగా వాళ్ళవైపు చూస్తూ.

అతని దర్పం చూసి వణికిపోయారు. లచ్చూ భీమాల నోటిలో నుంచి మాటలు బయటికి రాలేదు. ''మేం ఇక్కడ్నుంచి పోయినకాడి నుంచి ఎంత మార్పు! లోకమంతా తలకిందులయింది గిట్ల'' అదంత తలచుకుంటె లచ్చూ తల తిరిగిపోయింది. అదంత తమ కంతు పట్టని ముచ్చట్లు అనుకున్నాడు.

''ఇక్కడ్నే వాళ్ళను వుండనియ్యండ్రి దొరా! ఇంతకు ముందు వాళ్ళు ఆకయ దేవరను నమ్ముకొని బతికింద్రు. ఇప్పుడు మిమ్ముల్ని నమ్ముకొని బతుకుతరు. మిమ్ముల్ని దేవర లెక్క కొలుసుకుంటరు. పాపం! ఏదో రెక్కల కష్టం చేసుకుంట ఇక్కడ మీ కాల్ల దగ్గర పడి వుంటరు. ఏదో జాగా చూపిస్తే గుడిసె లేసుకుంటరు. మీ భూములు దున్నుతరు. తలా యింత భూమి ఇయ్యండ్రి. పంట పండించి పోస్తరు. లేకుంటె యీ భూమంత మీరేం దున్నిస్తరు'' అన్నాడు రంగయ్య.

''వాళ్ళకు నాగలి తోలొస్తద ? ఏమన్నానా ? ఏం వ్యవసాయం చేసి పంట పండించి పోస్తరు?'' అన్నాడు దొర అనుమానంతో.

"తలా ఓ నాగలి రెండు ఎడ్లు ఇయ్యండ్రి దొర! వాల్లే నాగలి తోలుడు నేర్సు కుంటరు. అదేమంత సుతారం! పంట పండించి మీ గరిసెల్ల పోస్తరు" అన్నాడు రంగయ్య.

దొర గమ్మున వుండిపోయాడు. ఆయన ఏమంటడో అని అందరూ మొస బిగబట్టుకొని నిలబడిపోయారు బొమ్మల్లాగా.

"సరే! అట్లనే గాని, మీ విల్లంబులన్నీ పారేయండ్రి మొదలు. నాగలి పట్టుడు నేర్సుకొండ్రి. వ్యవసాయం నేర్సుకున్నంక పంట పండించండ్రి. పండిన పంటల మూడొంతలు నాకు. ఒక వంతు మీకు. అంతేగాదు నాగలి ఎడ్ల పైసలు కట్టియ్యాలె ఏడాదికింత. అట్లయితేనే వుండండ్రి ఇక్కడ" అన్నాడు దొర. లచ్చు అందరివైపు చూసాడు. ఎవరు ఏమీ మాట్లాడలేదు. అందరూ మౌనంగా నేలకు చూపులు వేసి నిలబడిపోయారు. పంట గింజల్ని అంత ఆ దేవరకే కొలిచి పోసినంక తమకేం మిగులుతది! అనుకున్నారు మనసుల్లోనే. ఏం మాట్లాడలేదు.

"అట్లనే అనుండ్రిరా! మల్లా అనుమానాలెందుకు. ఇప్పుడు ఎక్కడకని పోతరు" అన్నాడు రంగయ్య. లచ్చు నిట్టూర్చాడు.

"సరే. అట్లనే కానీయండ్రి. మాకు గుడిసెలేసుకునె జాగా చూపించుండ్రి దొర...!" అన్నాడు లచ్చు. దొర రంగయ్యను దగ్గరిగా పిలిచి ఏదో చెప్పాడు.

"పదుండ్రి" అని రంగయ్య దారితీసాడు.

అందరూ అతని వెన్క నడిచారు. కొంచెం దూరం పొంగనె ఓ దుకాణం కన్పించింది. వచ్చిన వాళ్ళకు ఏమేమో అమ్ముతూ ఒక ఆడమనిషి కన్పించింది. ఆ దుకాణం వైపు చూస్తూ రంగయ్య "అదేరా నా దుకాణం మీకు ఏం కావాలన్నా రాండ్రి. మన సంబంధం ఇప్పటిది కాదుగద" నవ్వాడు రంగయ్య. రంగయ్య వాళ్ళను పెంకుటిండ్లకు దూరంగా ఖాళీ జాగావైపు తీసుక పోయాడు. తోవలో వాళ్ళకు వాళ్ళ దేవర ఆకయ గుడి వున్న చోటు కన్పించింది. అక్కడ మునుపటి మంటపం లేదు. చెట్టు మొద్దుతో చేసిన ఆకయ దేవర లేడు. ఆ గుడి అడుగున ఒక అందమైన దేవాలయం కట్టారు. గుడిలోంచి గంటలు చప్పుడులు, మంత్రాలు విన్పించాయి.

"దొర! జర ఆగుండ్రి మా ఆకయ దేవరకు మొక్కుకుంటం" అన్నాడు లచ్చు.

"అవును. మా దేవరకు మొక్కుకొని అయిటెంక గుడిసెలేసుకుంటం" అన్నాడు భీమా.

రంగయ్య నవ్వాడు. "ఇది ఇప్పుడు మీ దేవర గుడి కాదురా. ఇక్కడ దేవాలయం కట్టారు. మా దొర ప్రత్యేకంగా వేద పండితులను పిలిపించి యీ దేవాలయంలో పూజారులుగా నియమించాడు. నిష్టతో పూజలు జరుగుతున్నాయి. ఆ దేవాలయంలోకి మీకు ప్రవేశం లేదు. మిమ్మల్ని అడవి మనుషుల్ని చూస్తె ఆ పూజారి మెడలు పట్టి గెంటుతడు. జాగ్రత్త. అటు తొంగి చూడొద్దు మీరు" అని రంగయ్య ముందుకు నడిచాడు.

రంగయ్య మాటలకు అందరూ బిత్తరపోయారు. "ఇది మా దేవర జాగా. మేం లోపలికి పోతె ఆ పూజారి ఎందుకు గెంటుతడు. అయిన ఆ పూజారి ఎవరు. దేవరకు మొక్కొద్దా? ఆయనెందుకు వద్దంటడు?" తెల్లబోయి అన్నాడు లచ్చా.

"అంతేరా! మీరు ఆ దేవాలయంలోకి పోవద్దు. మీకు పోనీకి అనుమతి లేదు" అన్నాడు రంగయ్య ఆజ్ఞాపించినట్లుగా. వాళ్ళకు పిడుగుపడ్డట్లుగా అయి -

"ఏందిది! యీ భూమి, యీ జాగ, యీ గాలి, యీ నీరు, యీ జంగల్, యీ దేవర ఏదీ మాకు సొంతం కాదా?" దిమ్మెరపోయారు వాళ్ళు. వాళ్ళకేం తోచలేదు.

"సరే! ఏం జేస్తం. పదండ్రి. మన గుడిసెల దగ్గర్నె మల్లో గుడి కట్టి ఆకయ దేవరను నిల్పుకుందం" అన్నాడు లచ్చా పెద్దగా.

అతని వెంట దుమ్ముకొట్టుకుపోయిన వాళ్ళ నల్లటి శరీరాలు నగ్నంగా నిస్సత్తువగా కదిలాయి.

*- మూసీ సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక, నవంబర్-డిసెంబర్ 2000 సంచికలో 'కబ్జా' పేరుతో ప్రచురితమైంది*